

అలివేణి కూడా అందర్లాంటి అమ్మాయే. కాకపోతే కాసింత అందం, మరికాసింత అణుకువ, ఇంకాసింత అమాయకత్వం ఇలా అన్నీ సమతూకాలుగా మార్చి అందాలను ఏరికూర్చి సృష్టించాడు గ్రేట్‌బ్రహ్మ.

అదో పల్లెటూరు. అక్కడో చెరువుగట్టు. ఆ పక్కనే ఆనుకొని పళ్ళతోటలు. సాయంత్రం అయ్యిందంటే ఆ పొలాలెమ్మట, పళ్ళతోటల వెంటపడి ఆడుకోవడం, పరికిణీలు బిగించి దాగుడుమూతలు...చెట్టెక్కి కాయలు కోయడాలు.... ఒకటా...రెండా...బోల్డు అల్లర్లు. అందరమ్మాయిలూ ఆకతాయిలైతే, అలివేణి మాత్రం ఒట్టి అమాయకురాలు...పైగా తోటమాలి చూస్తే బావుండదంటోంది. అంత ఇన్నోసెంట్ గర్లన్న మాట! ఊళ్ళో అందరికీ పెళ్ళి సంబంధాలొచ్చేస్తున్నాయి. అమ్మాయిలందతా పెళ్ళికూతుళ్ళవుతున్నారు. అలివేణి మాత్రం ఇంకా పెళ్ళికూతురవ్వలేదు.

పెళ్ళికి క్వాలిఫికేషన్ ఆడతనం కాదని, డబ్బునే యింధనమే పెద్ద సర్టిఫికెట్‌అని, కాండక్ట్ సర్టిఫికెట్‌కన్నా, క్యాష్ సర్టిఫికెట్ బోల్డు పెళ్ళిళ్ళకు (బేరాలు చేసే పెళ్ళికొడుకులకు) ముఖ్యమన్న పాయింట్ తెలుసుకోవడానికి అలవేణికి చాలా టైమ్ పట్టింది. అలివేణిని చూసి చిదిమి దీపం పెట్టుకోవచ్చన్న కాంప్లిమెంట్ యిస్తూనే, ఏదో పిల్ల బుద్ధిమంతురాలు, గుణవంతురాలు పైగా అందగత్తె కనుక ఓ యాభైతో (అక్షరాల యాభైవేలతో) సరిపెట్టుకుంటామనే సంబంధాల సంఖ్య ఎక్కువ.

అంకెదాటి సంఖ్యగా మారినా ఏ సంఖ్యాశాస్త్రం ఆమె పెళ్ళిని కనఫర్మ్ చేయలేకపోయింది. న్యూమరాలజీ అదృష్టం అయితే, సైకాలజీ వాస్తవం. సగటు పెళ్ళికొడుకు వాళ్ళ తరఫువాళ్ళ సైకాలజీ అర్థమయింది. తనతో తొక్కుడు బిళ్ళాట ఆడిన కస్తూరి, జామ చెట్టెక్కి జామకాయలుకోసిన తాయారు, పూర్ణ అందరు కాన్పులకు, పరామర్శలకు వూరొచ్చి "ఏమే అలివేణి పప్పన్నం ఎప్పుడు పెడతావంటే" నవ్వి "ఇంట్లో పప్పులు నిండుకున్నాయి" అనేది. అంతకన్న జీవిత సత్యం యింకెలా విడమర్చి చెప్పగల్దు! ఎంతయినా పూర్

# అలివేణి

–సూరేపల్లి విజయ

అలివేణి కదా!

అలివేణి తండ్రికి పెంకుటిల్లు (వర్షం వస్తే స్ట్రెయిట్‌గా కాక ఇన్‌స్టాల్‌మెంట్ల మీద కురుస్తుంది) తప్ప సెంటు భూమికూడా లేదాయె. కూతురి పరిస్థితికి ఏడ్చేవాడు. సగటు మధ్య తరగతి తండ్రి యింకేం చేయగల్డు. బ్లడీ మిడిల్ క్లాస్ లైఫ్.

దేవుడా వర్షాలు కురిపించు అని వేడుకుంటే కంటి తుడుపుగా వర్షాలు కురిపించి, మరికొన్న ఆడపిల్ల తల్లిదండ్రుల కళ్ళలో నుండి కన్నీటి వర్షాలను కురిపిస్తాడు కాబోలు.

ఇదంతా మామూలుగా మామూలే అనుకంటే మామూలే, కాదనుకుంటే...

అలివేణి కథ యిక్కడితో ముగిసిపోలేదు. తను తప్ప మిగతా కన్నెపిల్లలంతా, అమ్మలైపోయారు. తండ్రి బాధచూడలేక తను బాధపడుతున్న అలివేణికి బస్తీ నుంచి వచ్చిన భాస్కర్ పరిచయమయ్యాడు.

"ఏమండీ మీరు అందంగా వుంటారు" చెరుకుతోటలో కలిసినప్పుడు అన్నాడు.

అలివేణి మామూలు ఆడపిల్ల అని ముందే చెప్పుకున్నాంగా...నవ్వింది సిగ్గుగా...అందంగా...అదిగో అక్కడే బ్యాడ్ టర్నింగ్ స్టార్టయింది అలివేణికి. ప్రేమించానని చెప్పే ప్రతీమగాడు యిచ్చే సోకాల్డ్ స్టేట్‌మెంటిదే!

మరో మెట్టెక్కి, "మిమ్మల్ని చేసుకునేవాడు పెట్టి పుట్టాలి" అన్నాడు. ఈసారి గర్వంగా నవ్వింది. కాని తన పరిస్థితి తలుచుకొని బాధపడింది.

మీరు ఊ అంటే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానన్నాడు (హమ్మో...ఎంత పెద్ద అబద్ధం!).

ఏం చెప్పాలో తోచక అలాగే నిలబడి పోయింది. అడ్వాన్సయిపోయాడు బస్తీ భాస్కర్.

ఆమె మీద చేయేసాడు. ఆ తర్వాత..అలా...అలా.. అలా...వయసు కోరికలు...మధ్యతరగతి బలహీనత...ఆడ మనసూ...అన్నీ కలిసి ఆమెను అమ్మతనానికి దగ్గర చేశాయి.

అలివేణికిప్పుడు మూడోనెల...పెరట్లో వాంతులు చేసుకుంటోన్న కూతుర్ని "ఏమ్మా...పైత్యం చేసిందా!" తలనిమిరి ప్రేమగా అడిగాడు తండ్రి. అవున్నాన్న ప్రేమపైత్యం అన్లేకపోయింది. కూతురు తప్పటడుగు వేసి తప్పుచేసింది అనుకోలేకపోయాడు. కానీ మంత్రసాని నీ కూతురు నిన్ను తాతను చేసిందని చెప్పాక ఆ తండ్రి ఆవేశంలో కూతుర్ని చంపేస్తానన్లేదు. తనే ఆవేదనతో గుండె పగిలి చచ్చాడు. డబ్బున్న వాళ్ళకు గుండె జబ్బులు, మధ్య తరగతి మనుషులకు గుండె పగిలే విషాద జబ్బులు వస్తాయేమో!

అలివేణి ఒంటరిదయింది.

బస్తీ భాస్కర్ దగ్గరికి వెళ్ళింది. "హమ్మో! మూడు నెల్లే.. వద్దొద్దు...తీయించుకో...నేను రేపే వూరెళ్ళాలి...నీ రుణం వుంచుకోను" అంటూ అయిదు వంద రూపాయల కాగితాలు ఆమె చేతిలో పెట్టాడు.

"ఎందుకూ?" అడిగింది సహజసిద్ధమైన అమాయకత్వంతో.

"ఎందుకేమిటి? మంత్రసానికివ్వొద్దు...వూర్కే అబార్షన్ చేస్తుందా ఏమిటి? ఈసారి నేను వచ్చేసరికి ఫ్రెష్‌గా తయారవ్వు" అన్నాడు.

మరి కడుపులో బిడ్డ సంగతేమిటని మళ్ళీ యిన్నోసెంట్‌గ అడిగితే...

"నన్నడిగితే నేనేం చెప్పాలి" అన్నాడు కన్నింగ్‌గా...

తండ్రి పోయాడన్న బాధకన్నా, తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రయిన భాస్కర్ మాటలు బాధించాయి.

"ఇప్పుడు నన్నేం చేయదల్చుకున్నారు?" అడిగింది భయంగా. బతుకుపట్ల అభద్రతాభావం కాదు...కడుపులో పెరుగుతోన్న బిడ్డపట్ల అవ్యాజమైన ప్రేమ భావంతో...

"నేనేం చేయదల్చుకోలేదు...టేకిట్ ఈజీ" అన్నాడు.

0-0-0

పొట్టమీద చేయివేసుకుని బాధగా నిమురుకొంది. ఇంకా రక్తమాంసాలతో వూపిరి

పోసుకోని మాంసం ముద్దా...అమ్మ కడుపు వెచ్చదనాన్ని అనుభవిస్తున్నావా! బాధగా అనుకుంది. ఆ రక్తపు ముద్దకేం తెలుసు... ఆ తల్లిపడే వేదన.

భాస్కర్‌లాంటి వాళ్ళ కథలు చర్విత చరణాలే, అలివేణి లాంటి జాలిగాధలు చర్వతచరణాలే...

మరి పరిష్కారం?

0-0-0

పూరి చివర చెరువులో శవమై తేలాలా?
ఇంటి దూలానికి వేలాడాలా?
మరో కుంతిగా తను మిగిలిపోవాలా?
ఇవన్ని మామూలే
ఆలోచించింది అమాయకమైన అలివేణి.

కాబోయే అమ్మగా, కలియుగలంలో కుంతిలా ...మగ వాడి వంచనకు గురైన వంచితగా...పురుష సర్పద ష్టగా...

నాలుగ్గోడల మధ్య పిల్లిని కొడితే పులిగా మారదూ... నిజం!

0-0-0

వూరు లేచింది.

ఆ వార్తా లేచి గుప్పుమంది బస్తీభాస్కర్ యింటిముందుకు రచ్చబండే కదిలొచ్చినట్టు....

నాటు వైద్యునికి ముచ్చెమటలు పోసాయి. త్వరగా బస్తీకి తీసుకెళ్ళమన్నాడు. కానీ ఈ లోగా మనిషిని... ముఖ్యంగా దానికి...?

వింటేనే వళ్ళు గగుర్పొడిచింది. అరిచి అరిచి స్పృహ తప్పి పడిపోయాడు భాస్కర్.

పోలీసులు రంగప్రవేశం...గొడవలూ...అన్నీ మామూలే...కానీ..సాక్షి..ఎక్కడ...?

బస్తీ భాస్కర్ కోమాలోకి వెళ్ళిపోయాడు. యించుమించు ఆ పల్లెలోనేకాదు, బస్తీలోనే కాదు, రాష్ట్రమంతా గుప్పుమంది!

బస్తీ భాస్కర్ మర్మాంగాన్ని ఎవరో బాకుతో కసిగా కోసేసారు. ఆ ఎవరు... ఎవరో...పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ దర్యాప్తు తేలినా, దోషులెవరో తేలినా లాభంలేదు. శిక్ష అనుభవించే అవకాశమే లేదు.

ఆ సరికే దోషి వూరి చివర చెరువులో శవమై తేలింది. తనను నమ్మించి, వంచించి, కలియుగ కుంతిని చేసిన భాస్కర్ మర్మాంగాన్ని కూరగాయలు తరిగే కత్తితో కసిగా కోసేసింది.

ఆ రాత్రి ఎవరికీ తెలియకుండా అతని గదిలోకి వెళ్ళి, అతనికి అనుగుణంగా వున్నట్టు నటించి తన కసి తీర్చుకుంది. అక్కడి నుంచి వూరి చివర చెరువు దగ్గరికి వెళ్లి...

కడుపులో బిడ్డతో మాట్లాడింది "రేయ్ కన్నా... నువ్వింకా రూపుదిద్దుకోని మాంసపు ముద్దవి...నిన్ను కలియుగ కర్ణుడ్ని చేసి, కలియుగ కుంతిలా నేను బ్రతకలేను. ఆ కుంతికి కర్ణుడి చరిత్ర వుంది. మనకు చరిత్ర వుండదు...శిథిలమయ్యే వ్యథ తప్ప...అందుకే నిన్ను నాతో తీసుకెళ్తున్నా...." అంటూ చెరువులో దూకింది.

ఇక్కడ తప్పొప్పుల పట్టిక అనవసరం...తప్పనిసరి పరిస్థితి తప్పు! ఆమె చేసింది తప్పో...ఒప్పో...

కానీ అతనికి విధించబడిన మర్మంగ ఛ్ఛేదన మాత్రం సరైనదే అంటోంది అలివేణి ఆత్మ.

ఇది ఇండియన్ పీనల్ కోడ్‌లో లేకపోవచ్చు. కానీ దగాపడ్డ స్త్రీ జాతి ఆవేశం...చెప్పిన కన్నీటి కఠినస్మృతి. ఈ మర్మంగ ఛ్ఛేదనం శిక్షగా విధించింది. ఇది ముగింపు కాదు....మొదలూ కాదు!

ఓ ప్రశ్నార్థకమైన ఆటవిడుపు...మళ్ళీ భాస్కర్‌లు తలెత్తితే...

అలివేణి ఎక్కడో వూ...పి...రి...పో....సు...కుం...టూ...నే....వుం...టుం...ది!

# 'ఠ'కారం కాదు...'ట'కారమే!

అష్ట అంటే ఎనిమిది. బుద్ధునిది అష్టాంగమార్గం. అంటే ఎనిమిది ప్రధాన అంశాలు కలిగిన మార్గం. సమ్యగ్దృష్టి, సమ్యక్సంకల్పం, సమ్యగ్వాక్కు, సమ్యక్కర్మ, సమ్యగ్జీవనం, సమ్యగావ్యయామం, సమ్యక్స్మృతి, సమ్యక్సమాధి. బౌద్ధ దర్మంలో ఈ ఎనిమిదీ అంగాలయితే ఒక్కోశాస్త్రంలో ఒక్కోవిధంగా అష్టాంగాలున్నాయి. యమ నియమాది అష్టాంగాలు యోగశాస్త్ర సంబంధమైనవి. శల్య శాలాక్యాదులు వైద్యశాస్త్ర సంబంధమైనవి. ఇట్లాగే గాయత్రీ మంత్రానికి సంబంధించి, చికిత్సకు సంబంధించి, ధర్మానికి సంబంధించి, సైన్యానికి సంబంధించి, పూజకు సంబంధించి, రాజ్యానికి సంబంధించి అష్టాంగాలున్నాయి. ఎనిమిది శరీరావయావలతోనూ చేసే నమస్కారం సాష్టాంగనమస్కారం.

మనభాష - 12



డి.చంద్రశేఖరరెడ్డి

అష్టాగ్నులు, అష్టైశ్వర్యాలు, అష్టకష్టాలు, అష్టకర్మలు, అష్టగణపతులు, అష్టలక్ష్ములు, అష్టదిక్కులు, అష్టదిక్పాలకులు, అష్టదిగ్గజాలు, అష్టనాయికలు, అష్ట ప్రధానులు, అష్టభాషలు ఈ విధంగా అష్ట సంఖ్యతో ఉండే అంశాలెన్నో ఉన్నాయి. పూర్వకాలంలో బహుభాషాపండితులను అష్టభాషా పండితులనేవాళ్లు. సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని, మాగధి, పైశాచి, చూళికాపైశాచి, అపభ్రంశం, తెలుగు అన్నవి ఆ అష్టభాషలు. 'ఓం నమో నారాయణాయ' అన్నది అష్టాక్షరి. పాణిని రచించిన ఎనిమిది అధ్యాయాల వ్యాకరణ గ్రంథం అష్టాధ్యాయి. ఇటీవలి కాలంలో అవధానాలు మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చాయి. అష్టావధానం వాటిలో ఒకరకం.

అష్టకం అంటే ఎనిమిది పద్యాల కావ్యభేదం. జనార్దనాష్టకం అనే సుప్రసిద్ధ అష్టకకావ్యం ఉంది.

ఇష్టం అంటే యజ్ఞంలో హోమదానాది క్రియ. ఇషు ధాతువు నుండి వచ్చింది. ఇచ్ఛ, కోరిక అని కూడా అర్థం. తెలుగులో ఇప్పుడు ఈ అర్థంలోనే వాడుతున్నాం. మనకిష్టమైనవాడు ఇష్టుడు. ఇష్టి అంటే యజ్ఞం, కోరిక. అభీష్టం అంటే వాంఛ, మనోరథం.

ఉష్ట్రం అంటే ఒంటె. ఎప్పుడూ ఎండలో తపిస్తుంది కాబట్టి ఉష్ట్రం. ఇదే కారణం వల్ల నిప్పుకోడి ఉష్ట్రపక్షి. తెలుగువాళ్లు ఈ మాటను తిట్టుగా కూడా వాడుతున్నారు.

ఉచ్ఛిష్టం అంటే ఎంగిలి. ఉచ్ఛిష్ట భోజనం అష్టకష్టాల్లో ఒకటి. 'బాణోచ్ఛిష్టం జగత్సర్వం' అని నానుడి. సంస్కృతంలో బాణకవి వాడని పదమే లేదట.

కృష్ట శబ్దానికి దున్నిన భూమి అని అర్థం. ప్రకృష్టం అంటే బాగుగా దున్నినభూమి. ప్రకృష్ట శబ్దాన్ని శ్రేష్ఠమైన అన్న అర్థంలో తెలుగులో వాడుతున్నాం. ఆ కృష్టం అంటే ఆకర్షింపబడినదని అర్థం. ఉత్కృష్టం అంటే గొప్పది. నికృష్టం అంటే నీచమైంది.

క్లిష్ట శబ్దానికి పీడింపబడినదని అర్థం. సంక్లిష్టం అంటే మిక్కిలి పీడింపబడినదని అర్థం. క్లేశం, కష్టం అన్న అర్థంలో వాడుతున్నాం. కష్టం కూడా అంతే. చొరరానిది, హింసించేది అని అర్థం.

చతుష్టయం అంటే నలుగురికి సమూహం. దుష్టచతుష్టయం సుప్రసిద్ధమే కదా.

త్వష్ట అంటే బ్రహ్మ. చెక్కేవాడు. నిర్మించేవాడు.

విష్టపమ్ అంటే స్వర్గం. త్రివిష్టపమ్ అంటే మూడోస్వర్గం. ఇప్పటి టిబెట్ అన్నమాట.

తుష్టి అంటే ఆనందం. సంతుష్టి అంటే సంతోషం. అసంతుష్టి అసంతోషం.

దుష్టం అంటే దోషం కలిగింది. నిర్దుష్టం అంటే దోషం లేనిది. నిర్దిష్ట, నిర్దుష్ట అనే రెండుమాటలకూ భేదం ఉంది. నిర్దిష్టం అంటే నిర్ణీతమైన, కచ్చితమైన అర్థం.

దృష్టం అంటే చూడబడినది. అదృష్టం అంటే కనిపించనిది. ఎవడి అదృష్టం వాడిది అంటే ఎవడి భాగ్యం వాడిది. విధాతరాత అన్నమాట. దృష్టి అంటే చూపు. దృష్టాంతం అంటే ఉదాహరణ.

ధృష్టుడు అంటే దిట్టతనం కలిగినవాడు. నలుగురు శృంగార నాయకులలో ఒకడు. అధృష్టుడు అంటే దిట్టతనం లేని వాడు, సిగ్గు కలిగినవాడు.

నష్టం అంటే కనపడకుండా పోయింది. కానరానిది.

పుష్టం అంటే పోషింపబడినది. దీనినుండే పుష్టి పౌష్టికాహారం. పిష్టం అంటే పిండి. పిష్టకం అంటే పిండితో చేసినవంట. పిష్టపేషణమనే ప్రయోగం ఉంది. పిష్టం అంటే పిండి. పేషణం అంటే పిండికొట్టడం. పిండిని పిండి కొట్టడం ఏమిటి? వృథా అన్నమాట. చెప్పిందే చెప్పడం.

ప్రతిష్టంభన అంటే ప్రతిబంధం, అడ్డుపడడం, కార్యవిఘాతం.

భ్రష్టం అంటే జారిపడినది. భ్రష్టుడు అంటే జారిపడినవాడు. సామాజిక విలువల నుండి దిగజారినవాడు అన్న అర్థంలో వాడుతున్నాం.

ముష్టి అంటే పిడికిలి. పిడికిలితో బిచ్చం వేస్తాం కాబట్టి ముష్టికి బిచ్చం అనే అర్థం కూడా తెలుగులో ఏర్పడింది. ముష్టివాడు అంటే బిచ్చగాడు. ముష్టిఘాతం అంటే పిడికిలిదెబ్బ. ముష్టియుద్ధం అంటే బాక్సింగ్. బాక్సరును ముష్టియోధుడనీ, బాక్సింగును ముష్టియుద్ధమనీ మనం వాడుకోవచ్చు.

మృష్టం అంటే శోధింపబడినవస్తువు. స్వచ్ఛమైంది. శుభ్రమైంది. మృష్టాన్నం అంటే శుభ్రమైన భోజనం. సంమృష్టం అంటే బాగా శుద్ధిచేసింది.

యష్టి అంటే కోల, కర్ర. భారయష్టి అంటే కావడిబద్ద. యష్ట అంటే యాగంచేసేవాడు. ఆదేష్ట అంటే యజ్ఞవిషయం బోధించేవాడు.

విష్టి అంటే వెట్టి. వృష్టి అంటే వర్షం. అతివృష్టి అంటే అవసరమైన దానికంటే ఎక్కువ వర్షం. అనావృష్టి అంటే అవసరమైనదానికంటే తక్కువ వర్షం. వేష్టితం అంటే చుట్టబడినది అని అర్థం. పర్యవేష్టితం, సమావేష్టితం దీనినుండే వచ్చాయి.

వ్యష్టి అంటే విడి. సమష్టి అంటే మొత్తం. రిష్టం అంటే శుభం, అశుభం అని రెండర్థాలూ ఉన్నాయి. అరిష్టం అన్నా అంతే. అరిష్టం అంటే పురుటిల్లు, కుంకుడు, వేప, వెల్లుల్లి, మజ్జిగ, ఆసన్నమరణం అన్న మాటలు కూడా ఉన్నాయి.

శిష్టం అంటే మిగిలింది. తక్కిన వాటినుండి విడిగా ప్రత్యేకమైంది. విశిష్టం మిక్కిలి ప్రత్యేకత కలిగింది. వైశిష్ట్యం అంటే ప్రత్యేకత. పరిశిష్టం అన్నా, అవశిష్టం అన్నా మిగిలింది అనే అర్థం.

సృష్టం అంటే నిశ్చయింపబడినది, బహుళమైనది. సృష్టి సృజింపబడేది.

స్పష్టం అంటే వెల్లడి అయినది. స్ఫుటమైనది. దీనికి వ్యతిరేకం అస్పష్టం. విస్పష్టం మిక్కిలి స్పష్టం. హృష్టం అంటే సంతోషించినది. హృష్టి అంటే సంతోషం.

ఈ మాటలన్నిటిలోనూ 'ట'కారమే ఉంది. 'ఠ'కారం లేదు.



3